క్లుప్తంగా

స్క్రాప్‌నకు వేలం



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

బెల్లంపల్లి: వినియోగంలో లేని బెల్లంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను స్క్రాప్ కింద సోమవారం వేలం వేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న స్క్రాప్‌కు వేలం నిర్వహించగా నలుగురు వ్యాపారులు బహిరంగ వేలంలో పాల్గొన్నారు. వీరిలో ఎస్కే నజీర్ అనే వ్యాపారి రూ.2లక్షలకు వేలం పాడి స్క్రాప్‌ను సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ ఏ.ఈ సందీప్, టీపీవో అశ్రిత్, ఆర్‌ఓ భుజంగరావు, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, చంద్రశేఖర్, సురేష్, గోసిక రమేష్, కో–ఆప్షన్ సభ్యుడు వాజిద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీదేవర బోనాలు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో రెండు రోజులుగా లక్ష్మీదేవర బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలతో పార్‌పల్లిలో ఆధ్యాత్మిక శోభా నిండుకుంది. జాతరకు పార్‌పల్లి గ్రామస్తులే కాకుండా పిన్నారం, ఎడగట్ట, కొల్లూర్, లింగన్నపేట, ఎదులబంధం, చెన్నూర్ లాంటి ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కోటపల్లి వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, విద్యాసాగర్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై వెంకట్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'మద్యం పార్టీలు చేస్తే చర్యలు'

శ్రీరాంపూర్: సింగరేణి గనులు, డిపార్టుమెంట్లపై మద్యం పార్టీలు చేస్తే చర్యలు తప్పవని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి హెచ్చరించారు. గనులపై ఉద్యోగులు, అధికారులు జూదం, మద్యం సేవించడం, కొట్లాడటం చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఇటీవల అన్ని గనులు, డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కొన్ని ఇలాంటి ఘటనలు జరగడంతో కంపెనీ నిబంధనల ప్రకారం, ఇవి జరగకుండా చూడాలన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామంలోకి ఏటా భారీ వర్షాలకు అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ తమ ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆ గ్రామస్తులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ గ్రామంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలోకి వెళ్లి స్థలాన్ని ఆక్రమిస్తామని, అక్కడ గుడిసెలు వేసుకోనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వమే ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు.

అవగాహన

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ వసతి గృహంలో డిగ్రీ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై సోమవారం అవగాహన కల్పించారు. టీపీఏ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జీవితంలో కష్ట సుఖాలు, సమస్యలు సాధారణమైనవన్నారు. ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని చక్కటి జీవితాన్ని ఏర్పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణరావు, క్లినికల్ న్యూట్రిషన్ మహతి శ్రీ, రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

పఠనోత్సవం ప్రారంభం

జైపూర్: జైపూర్ మండలం కాన్కూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం పఠనోత్సవ కార్యక్రమాన్ని ఎస్సై ఉపేందర్‌రావు, స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఎస్ఎంసీ చైర్మన్ మహేష్, ఉపాధ్యాయులు ఆళ్ల రాజేందర్, మామిడి దివ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రక్షణ కల్పించాలి

పాతమంచిర్యాల: స్వతంత్ర జర్నలిస్టు, సామాజిక విశ్లేషకురాలు తులసిచందుకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీలత, సరోజ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

ఫ్రీడం ఫైటర్స్‌పై కవితా సంపుటి

మందమర్రిరూరల్: దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఫ్రీడం ఫైటర్స్‌పై రిటైర్డ్ ఆర్మీ, ఏరియాలో ఎస్ అండ్ పీసీ విభాగంలో సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్న హర్యానాకు చెందిన రాజేశ్ పిహల్ బూంద్ బూంద్ ఖూన్ దే గయే, ధర్తి పర్ పర్ (హిందీ) కవితా సంపుటి పుస్తకాన్ని రూపొందించారు. సోమవారం మందమర్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై చంద్రకుమార్ ఆవిష్కరించారు.

టీసీల జారీకి వసూళ్లు!

- డబ్బులు ఇస్తేనే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు అందజేత
- ఒక్కో విద్యార్థి నుంచి కనిష్టంగా రూ.400 వరకు డిమాండ్
- పాఠశాలల తీరుతో విద్యార్థులకు ఆర్థిక కష్టాలు
- ఇటీవల వైరల్‌గా మారిన ఉపాధ్యాయుల కాల్ రికార్డు


APPENDIX - 7
Office of the Dist. Educational Officer, MANCHERIAL, T.S.
RECORD SHEET

విద్యార్థులకు అందజేసే రికార్డు షీటు

మంచిర్యాలఅర్బన్: ఒక పాఠశాలలో చదువుకుని, పై చదువుల కోసం మరో పాఠశాలకు వెళ్లాలంటే బదిలీ సర్టిఫికెట్ అవసరం కాగా, దీనిని ఆసరాగా చేసుకుంటున్న కొందరు ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన సర్టిఫికెట్లకు డబ్బులు వసూలు చేస్తుండడంతో విద్యార్థులపై ఆర్థికంగా భారం పడుతోంది. ఈ వివరాలతో కథనం..

పాఠశాల, కళాశాల నుంచి మరో దానికి మారటం దాదాపు విద్యార్థి విద్యా ప్రయాణంలో ఒక భాగం. విద్యార్థి మునుపటి సంస్థ నుంచి నిష్క్రమించటానికి టీసీ ఒక రుజువు, విద్యార్థిని పాఠశాల, కళాశాల సంస్థల నుంచి విడుదల చేయటం దీని ఉద్దేశం. పాఠశాల స్థాయిలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు రికార్డు షీట్ ఇస్తారు. ఆరు నుంచి పదోతరగతి వరకు టాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)లు అందజేస్తారు. ఇందులో తల్లిదండ్రుల పేర్లు, విద్యా సంబంధ రికార్డులు, సంస్థలో చదువుకున్న ప్రోగ్రామ్, సంస్థ రికార్డుల ప్రకారం పుట్టిన తేదీ, తదితర వ్యక్తిగత వివరాలు ఉంటాయి.

రికార్డు షీట్లు.. టీసీ బుక్‌లు జారీ ఇలా..

పాఠశాల స్థాయిలో అందజేస్తే రికార్డు షీట్లు, టీసీ పుస్తకాలు విద్యాశాఖ అందజేస్తుంది. ఇందుకు రికార్డు పుస్తకం కోసమైతే ప్రైవేట్ పాఠశాలలు 500, టీసీ పుస్తకం కోసం రూ.700 చెల్లించాల్సి ఉంటుంది. టీసీ పుస్తకం కోసం రూ.400, రికార్డు పుస్తకం కోసం రూ.300ముద్రణ ఖర్చుల కింద చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో పుస్తకంలో 100 పేజీలు ఉంటాయి. ఆయా పాఠశాలలు ఉచితంగా విద్యార్థికి అందజేయాల్సి ఉంటుంది.

జరుగుతున్నదేమిటి..

టీసీ, రికార్డు షీట్లు అందజేయటంలో క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా సాగుతోంది. విద్యార్థుల అవసరాలను ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కో టీసీకి రూ.300 నుంచి రూ.400 వరకు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన పుస్తకంలో వంద పేజీలు ఉంటే రెండు పేజీలతోనే టీసీ పుస్తకం పెట్టిన ఖర్చు తీరిపోతుంది. అంటే మిగిలిన 98పేజీలు అంటే 98మంది విద్యార్థుల దగ్గర రూ.400 చొప్పున వేసుకున్న 39,200 ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్న మాట. విద్యాశాఖకు చెల్లించిన పుస్తకం ఖరీదు 700అనుకున్నా, రూ.7 మాత్రమే సరిపోతుంది. ప్రైవేట్‌లో ఇతర ఫీజులు ఏమైనా పెండింగ్‌లో ఉన్నా టీసీలతో ముడిపెట్టి, పాఠశాలల చుట్టూ తిప్పుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మరోలా ఉంది. కొంత మంది పాఠశాలల ఖర్చుల కింద విరాళాల పేరిట వసూలు చేస్తున్నారు. ఇంకొందరూ వస్తు రూపేణా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉచితంగా ఇవ్వాల్సిన టీసీ, రికార్డు షీట్లపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

- జిల్లా కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదివాడు. 2023- 24 విద్యా సంవత్సరంలో మరో పాఠశాలలో చేరాలని నిర్ణయించుకున్నాడు. టీసీ కోసం తాను చదివిన పాఠశాలకు వెళ్లగా యాజమాన్యం రూ.400 చెల్లిస్తేనే ఇస్తామని చెప్పింది. దీంతో ఏమీ చేయలేక అడిగినంత చెల్లించుకోవటం విద్యార్థి వంతైంది.
- టీసీల కోసం బడికి వస్తే డబ్బులడిగారట కదా..?.. డబ్బులు రేపైనా ఇవ్వమన్నారట. నేనే ట్రాన్స్‌ఫర్ చేస్తాను.. ఎవరు అడిగింద్రు? వాళ్లకే ఇయ్యి.. అయినా మనసులో ఉంటే ఓ కుర్చో.. బెంచీనో ఇవ్వాలన్నారట... అంటూ ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో టీసీ కోసం వస్తే ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య జరిగిన సంభాషణ వైరల్ అయిన విషయం తెలిసిందే.

చర్యలు తప్పవు..

పాఠశాలల యాజమాన్యాలు టీసీ, రికార్డు షీట్లు ఇచ్చే క్రమంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఉచితంగానే టీసీ, రికార్డు షీట్‌లు ఇవ్వాలి. విద్యార్థుల తల్లిదండ్రులు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తప్పవు.

– యాదయ్య, డీఈవో

పంచాయతీలు అన్ని వసతులు కలిగి ఉండాలి

- అదనపు కలెక్టర్ రాహుల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు పూర్తి స్థాయి మౌలిక వసతులు కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. నస్పూర్‌లోని జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశం మందిరంలో సోమవారం ఆయన జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రకాశ్‌జాదవ్‌తో కలిసి మండల పంచాయతీ అధికారులు, సహాయ పంచాయతీ అధికారులతో గ్రామ పంచాయితీల్లో మౌలిక సదుపాయాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణం, తెలంగాణ హరితహారం నిర్వహించాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్, వైకుంఠధామాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందాలు రానున్నాయని, ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

కోటపల్లి: మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీపీ మంత్రి సురేఖా వినతిపత్రం అందజేశారు. పిల్లల వసతికి సరిపడా గదులు అందుబాటులో లేవని, కేవలం ఏడు రూములు మాత్రమే ఉండటంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేదవిద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో సరిపడా గదులు లేవని, దీంతో నిరుపేద ఎస్సీ విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన దుస్థితి నెలకొందని వివరించారు. గతంలో జెడ్పీహెచ్ఎస్ కోటపల్లి పాఠశాలలో రెండు గదులు కేటాయించడంతో, గత సంవత్సరం సర్దుబాటు చేశామని, ఈ సంవత్సరం స్కూల్ యాజమాన్యం గదులు ఇవ్వడానికి నిరాకరించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. పేద విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా వసతి గృహానికి అదనపు గదులు నిర్మించాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనలు



పోడు పట్టాలు ఇప్పించాలని నిరసన చేస్తున్న రైతులు

నస్పూర్: నస్పూర్ పట్టణంలోని జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని సోమవారం పలు సంఘాలు, రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. జైపూర్ మండలం దుబ్బపల్లి, వెంకట్రావుపల్లి, నర్వ, జైపూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమకు పోడు పట్టాలు ఇప్పించాలని కోరుతూ నిరసన తెలిపారు. పశు మిత్రలకు కనీస వేతనం చెల్లించాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. భీమారం మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాములు, దుర్గం తిరుపతి, దుర్గం మహేందర్, పుణ్ణం చంద్, దుర్గం సత్తయ్యలు భూములకు పట్టా పాస్‌బుక్ ఇప్పించి, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని వేడుకున్నారు.

హెచ్ఎంపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరంలో మంజూరైన మరుగుదొడ్లు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు సోమవారం హెచ్ఎం సుభాష్‌ను పనులు ఎప్పుడు పూర్తవుతాయి, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అడిగితే మీరెవరు.. నన్ను అడగడానికి.. అని విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులపై ఆగ్రహం వ్యక్తం చేసి దురుసుగా ప్రవర్తించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు భట్టు శ్రీనివాస్, గోమాస డాగయ్య, గోమాస వెంకటి, చింతపురి వెంకటి ఎంపీడీఓ రాధాకిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై దురుసుగా ప్రవర్తించిన హెచ్ఎంపై చర్యలు తీసుకొని వెంటనే మరుగుదొడ్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



చెన్నూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండేకు వినతి



జన్నారంలో తహసీల్దార్‌కు వినతి

జన్నారం/లక్సెట్టిపేట/దండేపల్లి/చెన్నూర్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. పెన్షనర్లకు ప్రభుత్వం ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు అందజేయాలని, ఈహెచ్ఎస్ అమలు చేయాలని కోరారు. రూ.398తో నియమించిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రీమెంట్‌లను ఇవ్వాలని పేర్కొన్నారు. రెండవ పీఆర్సీ అమలు చేసి ఐఆర్ చెల్లించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో 85శాతం పెన్షనర్లు సభ్యులుగా ఉన్నందునా, సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరారు. జన్నారం, లక్సెట్టిపేట, దండేపల్లి, చెన్నూర్ మండలాల్లో పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

గడపగడపకూ బీజేపీ



చెన్నూర్‌లో కరపత్రాలు అందిస్తున్న నాయకులు

చెన్నూర్/భీమిని/మందమర్రిరూరల్: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు సోమవారం గడపగడపకూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కన్నెపల్లి మండలంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మందమర్రిలో పట్టణ అధ్యక్షుడు నరేష్, చెన్నూర్‌లో మండల బీజేపీ నాయకులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు



భీమారంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

వేమనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించగా, ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. సత్వర పరిష్కారానికి ప్రజావాణి ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, సీఆర్పీ సునిల్, అధికారులు పాల్గొన్నారు.

భీమారం: ప్రతివారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ ప్రజలను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి దరఖాస్తులు రాలేదు. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ.. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ప్రజావాణికి వచ్చి దరఖాస్తు చేసుకొంటే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసంతితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ అజ్మత్‌అలీ, ఈజీఎస్ ఏపీఓ గంగాభవాని, ఏఓ కవిత, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మందమర్రిలో ఒక్క ఫిర్యాదు

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు వచ్చింది. పట్టణంలోని మూడో జోన్‌లోని ఖాళీగా ఉంటున్న సింగరేణికి చెందిన పాత ఐటీఐ కళాశాల భవనాన్ని గ్రంథాలయం గానీ, ప్రభుత్వ వసతి గృహం గానీ చేయాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ ఎంపీడీఓ శశికళకు ఫిర్యాదు చేశారు.

'పదకొండు దాటినా.. హాజరుకాని అధికారులు'



దండేపల్లి: మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సమయపాలన పాటించడం లేదు. కొందరైతే హాజరుకావడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 11.30గంటలు దాటినా ఏ ఒక్క అధికారి కూడా హాజరు కాలేదు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి.

జీఎం(పీపీ)కి సన్మానం

శ్రీరాంపూర్: ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్(పీపీ) జీఎం ఎం.నరసింహారావును శ్రీరాంపూర్ ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. శ్రీరాంపూర్ లోని బంగ్లా ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో సోమవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఎస్‌టీపీపీ జీఎం సూర్యనారాయణ రాజులు రిటైర్డ్ జీఎం దంపతులను శాలువాతో సత్కరించి, వారు కంపెనీలో చేసిన సేవలను కొనియాడారు. 40సంవత్సరాలుగా వివిధ హోదాలో పనిచేసి, కంపెనీ అభివృద్ధికి నరసింహారావు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అన్ని గనుల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

తాగి నడిపితే కఠిన చర్యలు

శ్రీరాంపూర్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్ తెలిపారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద సోమవారం ఆటో డ్రైవర్లకు, యువకులకు రోడ్ సేఫ్టీ, 100డయల్, షీ టీమ్స్ సేవలు, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. లైసెన్సు లేని వారికి వాహనాలు ఇస్తే వాహన యాజమానిపై కూడా కేసు నమోదు అవుతుందన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నెన్నెల: కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కౌలురైతు తాక్రే భిక్కు రెండు రోజుల క్రితం పిడుగుపాటుకు గురై మృతి చెందగా, నెన్నెల మండలం నందులపల్లికి చెందిన ఆదర్శ రైతు కొండపల్లి శరత్ దాతల సహకారంతో సేకరించిన రూ.15 వేల నగదు బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు.

వేమనపల్లిలో భారీ వర్షం

వేమనపల్లి: మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవగా, మత్తడి వాగు వంతెన వద్ద తాత్కాలిక రోడ్డు బురదమయంగా మారింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



గోరింట పూసింది..



మంచిర్యాలఅర్బన్: స్థానిక గౌతమినగర్ (26వ వార్డు)లో సోమవారం గోరింటాకు పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ నాంపల్లి మాధవి ఆధ్వర్యంలో మహిళలంతా ఒక చోట చేరారు. వివిధ ఆకృతుల్లో చేతులకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోయారు.

సమాచారం

నేడు రక్తదాన శిబిరం

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ డిపోలో ఈ నెల 27న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఆర్టీసీ సిబ్బందితో పాటు యువజన సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. రక్తదాతలు పేరు నమోదుకు ఫోన్ నంబర్ 8328021517లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: పట్టణంలోని టౌన్–2 ఫీడర్ పరిధిలో మరమ్మతు నిర్వహించాల్సి ఉండడంతో మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయాన్ని టౌన్–2 పరిధిలోని ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

ఆంగ్ల అధ్యాపకుడు కావాలెను

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్‌లో అడ్‌హక్ ప్రాతిపదికన 2023–24విద్యా సంవత్సరం బోధించడానికి ఇంగ్లిష్ అధ్యాపకుడు కావాలని ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి, ఆసక్తి గల వారు జూలై ఒకటో తేదీలోగా పాఠశాల హెచ్ఎంకు దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే నెల 3న ఇంటర్వ్యూ, డెమో ఉంటుందని శ్యాంసుందర్ తెలిపారు. తదితర వివరాలకు పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

హాస్టల్ ప్రవేశ దరఖాస్తులకు ఆహ్వానం

జన్నారం: స్థానిక బీసీ వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించి వసతి గృహంలో ప్రవేశం పొందాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ : 96526 74367లో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలల బంద్ సంపూర్ణం

తాండూర్/చెన్నూర్/జన్నారం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపు సంపూర్ణంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. విద్యార్థులు తరగతులు బహిష్కరించి సంఘీభావం తెలిపారు. కొన్ని పాఠశాలలకు ఏబీవీపీ శ్రేణులు వెళ్లి బంద్ పాటించాల్సిందిగా సూచించారు. పాఠశాలల బంద్ విజయవంతం కావడంతో ఏబీవీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

'భూ కబ్జాకు పాల్పడలేదు'

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ బూడిద గడ్డ బస్తీలో ఓ మహిళ ఇంటి స్థలాన్ని కబ్జా చేసినట్లు బాధితురాలు చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని హోంగార్డు సురేశ్ భార్య దుండ్ర అరుణ తెలిపారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బస్తీలోని సింగరేణి కంపెనీ క్వార్టర్‌లకు అన్నింటికీ సరి సమానంగా స్థలాలు ఉన్నాయని, తమ ఇంటి పక్కన నివాసం ఉంటున్న గోసిక సుధ అనే మహిళ ఆమె భూమిని తాము కబ్జా చేసినట్లు ఆరోపించడం సరికాదన్నారు.

'కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'

దండేపల్లి: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని దండేపల్లిలో ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద రహదారిపై సోమవారం కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మందమర్రిరూరల్: తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయని, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సోమవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వాడల్లో ప్రచారం చేపట్టారు. ర్యాలీ నిర్వహించారు.

ఛత్రపతి సాహు జయంతి

శ్రీరాంపూర్: ఛత్రపతి సాహు మహరాజ్ జయంతిని బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని కొత్తరోడ్‌లో జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి కాదాసి రవీందర్ పాల్గొని సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జ్యోతి బా పూలే కాలనీగా నామకరణం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో రోడ్ నం1 లో ఉన్న కాలనీకి బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు మహాత్మా జ్యోతి బాపూలే కాలనీగా నామకరణం చేశారు.